# యమునాతీరం

'ఏం బాబూ' అన్నాను.

'ఏం లేదురా నాయనా' అంటూ లోపల చతికిలపడ్డాడు సుబ్బన్నబాబు.

కావడం ఇరుగూ పొరుగేకాని, నేను పుట్టి బుద్ధెరిగిన తరువాత సుబ్బన్నబాబు ఎన్నడూ పనీపాటా లేకుండా పరాయి యింటికి పెత్తనానికి వెళ్ళడంకాని, తీరుబడిగా కూర్చుని పొద్దువెళ్ళబుచ్చడానికి అమాటా – యీమాటా చెప్తుతూ, ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడం కాని...నేను చూసిన పాపాన పోలేదు. ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉండేవాడు. విస్తళ్ళు కుట్టడమో, జంధ్యాలు వడకడమో, మొక్కలకు పాదులూ – పబ్బాలు కట్టడమో; అదీ ఇదీ కాకుంటే పెళ్ళానికి తిరగలి తోడుపట్టడమో – ఆ మానవుడికి విసుగూ విరామమూ అంటూ ఎన్నడూ లేదు. వేద – పండు; కల్లాకపటం ఎరుగని అమాయకుడు. ఈ కాలంవాడు కాడు. అయనే కాదు; ఆ దంపతుల పుణ్యమే అంత. వాళ్ళంటే మా వాడకట్టు అంతా నెత్తిని పెట్టుకుంటుంది.

'మామిడిపండు ఒకటి కోసి పెట్టనా?'

'పోనీ కాస్త పంచదార పానకం చేసి యిస్తాను పుచ్చుకుంటావూ?'

ఊహుఁ ఏదీ వద్దన్నాడు, బైట చూడబోతే నిప్పులు చెరుగుతూంది. సుబ్బన్నబాబూ! నాచేత గుక్కెడు నీళ్ళన్నా దాహం పుచ్చుకుంటే బాగుండు ననిపించింది. కాని, అయన ఏమీ వద్దంటాడు.

మరి, ఏమిటి?

'చంటి వాడికి ఏమిటో ఇదిగా ఉందిరా నాయనా' అన్నాడు ఓ క్షణానికి తెమిలి. ఇందాకటినుంచీ వచ్చినపని నాతో ఎలా చెప్పాలా అని, మాట తెముల్చుకునేందుకు తంటాలు పడుతున్నాడని ... ఆ వాలకమే చెపుతూన్నది.

'ఏం, ఎలా ఉంది?'

'ఏదో ... ఇదిగా ఉంటున్నాడురా'

'జ్వరమా?'

'జ్వరమూ అనేందుకు వల్లకాదురా'

'మరి, ఏమిటి?'

'ఏమిటో అదో ఇదిగా....'

'సరే, నేను వచ్చి చూస్తాను రా బాబూ'... అని బయలుదేరాను. ఎంత ఎండైతే మాత్రమేం ఇదిగో, పక్క గుమ్మమే.

అచ్చన్న లోపల గుమ్మంలో కూర్చుని పండు బాదమాకులు బొత్తులు చేసి తిరగలిక్రింద ఎత్తుపెడుతున్నాడు. మనిషి కేం, మనిషి కమ్మెచ్చున తీసినట్టు, లక్షణంగానే ఉన్నాడు.

'ఏమిరా, ఏమిటి విశేషం?'

'ఏం లేదు అన్నయ్యా, మరే...'

సరే, ముప్పొద్దులూ సుష్టుగా భోంచేస్తున్నాడు, కావలసిందేమో, తిన్నది లక్షణంగా అరుగుతూన్నది. నిద్ర, ఓ కునుకు ఎక్కువే తీస్తున్నాడు. ప్రొద్దున్నే లేవడంతోనే బద్ధకంగా ఉండదు...బాగానే ఉంది. కాని, మొత్తానికి వంట్లో ఏదో ఇదిగా ఉంది. అదిమటుకు నిజం. నాడిలో ఏ దోషమూ కనిపించడం లేదూ, కళ్ళూ మొగం శుభ్రంగా తేటగా ఉన్నవి. కాని, అదీ సంగతి ... ఎక్కడో ఏదో మరచెడి ఉండాలి.

'ఒళ్ళు ఎప్పుడూ వెచ్చగా ఉంటూoదన్నయ్యా'

అవును, ఎండలు మండిపోతూంటే ఒళ్ళు వెచ్చగా వుండటం అబ్బురమా? ఒంటిమీద బట్టలంటివి గాజు పెంకులు లాగా ఫెళ ఫెళలాడిపోతున్నాయి. మంచం, కుంచం, ఒకటేమిటి, దేన్ని చూసినా సెగలూ పొగలూ వెళ్ళుకొస్తూంటే. ఒళ్ళు వెచ్చగా ఉండదూ? – ఉంటుంది ప్రతి వాడికీ అలాగే ఉంటుంది. ఎండను కాగడం ఒంటికి ఎంత మంచిదనుకున్నారేమిటి. ఈ వేడికి తాళుకుంటే ఇహ ఏటికి ఏడాది పొడుగునా రోగం రొష్టు అంటూ ఉండదు.

ఎబ్బే, ఇది జ్వరమంటారా; జ్వరం ఎంతమాత్రమూ కాదు. ఇదే జ్వరం పోణిమి అయితే, అప్పుడే పడేసేది. ఇన్నాళ్ళు తిరగనిచ్చేదా, అసలు ఒక్క నిముషం కూచోనిచ్చేదా? – అంకురించడం భయం ... ఈ వేసం కాలంలో ... జ్వరం, తాచుపాం విషంలాగా ఛర్రున ఎక్కిపోతుంది. ఇలా వదిలిపెడుతుందా?

నిజమే, నీవు చెప్పేవన్నీ నిజమే. మరి అచ్చన్నకు వంట్లో ఏమిటి? – పాలుతాగే బాల పాపడు కాడుకదా? పది – పద్దెనిమిదేళ్ళవాడు. వాడికి ఆమాత్రం తిరుగుడు తెలియదూ? మొత్తానికి వంట్లో ఏదో ఇదిగానే ఉండిఉండాలి.

ఊరికే బింకానికి పోడమే కాని, నిఝంగా మన తెలివితేటలు ఇలాగే ఉంటాయి. ఇన్నాళ్ళనుంచీ వైద్యం నాకు మహా తెలుసునని ఒక నీలుగు. ఏమిటి, నామొహం తెలిసింది? వాడు దేంతోనో ఇదవుతున్నాడని మనసుకు తెలుస్తూనే ఉండెను! – అది ఇతమిద్ధమని తేల్చి చెప్పడానికి నోట మాట పెగిలి రాక పోతూండెను.

సరే, 'మరేం ఫరవాలేదుగాని, ఇంతలో వచ్చే ప్రమాదం ఏమీలేదు ... ఏదో కాస్త నలతగా ఉన్నాడు కాని, అంతకన్న' మరేం లేదు –' అన్నా మనుకో. పాపం, ఆ అమాయకుడు ఎంత ఆదుర్దాగా అడిగాడో ఒకసారికి నాలుగుసార్లు – 'మరేం లేదుగదా నాయనా, వాడి వంట్లో రుగ్మత –'

'ఏం లే'దనడం, సుబ్బన్న బాబుతో అబద్ధం చెప్పడం. ఆ ఋషితో అవసరానికైనా అబద్ధం ఆడటం అంటే ఎవరికైనా తల తీసేసినంత పని! కాని –

తెల్లవార్లూ నాకు యిదే ఆరాటం. ఇదే గుంజాటన.

ఒంటరిగా పడుకుంటే ఏదీ పాలుపోదు ... ఆలోచన తోచదు ... అసలే నిద్ర వచ్చేట్టు లేదు.

రైలుమించి పోతుందేమోనన్న తొందరలో మా అవిడ చీరెలు గడి విప్పకుండానే అక్కడ పారేసి పోయింది...కొత్త చీరెల మీద సాలీడు పాకుతూంది ... చీరె కన్న చీరె అంచు చాలా నాజూకుగా ఉంది ... ఇలాంటిది లక్ష్మీకాంతం కట్టుకుంటే చాలా బాగుంటుంది. కల్ నేతలో మరీ బంగారంలాగా మెరిసిపోతుంది.

లక్ష్మీకాంతం ఊళ్ళో ఉంటే ఎంత బాగుండేది ... ఉహుఁ – అవసరం వచ్చినప్పుడు ఎవ్వళ్ళూ ఉండరు. ఉట్టప్పుడూ, ఎక్కడ చూసినా తొక్కితే వెళ్ళొస్తూంటారు. ఈ పెళ్ళిళ్ళూ ఒడుగులూ కాదుగాని, అదనుకు అయిన ఆడదొక్కత్తే ఊళ్ళో ఉండకుండా పోతూంది ... రామ రామా యటంచు నా రాజసుతుడు ... కృష్ణ కృష్ణా యటంచు ...

కృష్ణరాయలు శ్రీకాకుళంలో బబ్బున్నప్పుడూ తెల్లవార్లూ ఏం ఆలోచించాడో, పక్కకుదరక ఎంతసేపు అటూ ఇటూ దొర్లుతూ ఉన్నాడో పాపం? తెల్లవారిగట్ల అయితే కాని, దేవుడికీ తీరలేదు ... యీ దేవుడి కలలోకి రావడానికి.

రామ బాణం పురుగులు, అన్నీ ఒక్కటే మురా అనుకోవడం చాలా పొరబాటు అనిపిస్తోంది. వాటి అభిరుచులను పట్టి – వాళ్ళలోనూ సనాతనులూ – అధునాతనులూ ఉన్నారని భేషుగ్గా అనుకోవచ్చు. ఇదిగో గడ్డాలు మీసాలూ, అచ్చంగా దూర్వాసుడిలాగా పరుగెత్తుతూంది ... దీనికి పాపం ఆముక్త మాల్యద కొంత కాకపోతే కొంతన్నా కొరుకుడుపడి ఉంటుంది ... పక్క పక్కలా ... ఇదే. నాలుగు రోజులపాటూ నవ్యసాహిత్య గ్రంథం దేంట్లోనన్నా ఉంటే యీ మోటుతనమంతా పోయి, నాజూకు తేలుతుంది ... అసలా నడకే మారుతుంది – ఆడో మగో తెలియకుండా ...

ఆహాఁ – ఆడా మగా ... ఆ బాదరబందీ లేమీ తెలియనివాడు.

తెలియని వాడంటే ఆ పోణిమి లేదని కాదు ... అందులో క్రిందూ మీదూ విడమరచి చెప్పలేని శుద్ధ ...

విష్ణుచిత్తుడూ ... అఁ ... పాపం, అమాయకుడు ... 'అయ్యగారూ మా అమ్మాయి వంట్లో ఏదో ఇదిగా ఉంది' అని ఖంగారు పడుతూ నానా హైరానుగానూ గుళ్ళో పోయిపడ్డాడు.

సరి – సరి ... అఁ ...

'తెలిసిందిలే బాబూ ... మన వాడికి' ... హా-ద్ద-దీ సంగతి?

'మరే ప్రమాదం లేదుకద, నాయనా'

'నాదీ పూచీ అన్నానుగా'

'నీదేలే నాయనా. నీదీ, ఆ ఏడుకొండల వాడిదీ ... ఏమిటోలే నాయనా, ఈ కాలాలు, ఈ రోగాలూనూ ... నిమిషాని కోటి అవతరిస్తూంది ... నేను కనా వినా లేదు సుమా నాయనా ... ఆదికాలంలో ఉండేవట శైవజ్వరం – వైష్ణవ జ్వరం అని ... ఇది కామ జ్వరం అంటూంటివి ... ఇదీ అంత ప్రాచీనమేనా నాయనా?'

ఆయన అంత అమాయికంగా మడిగట్టుకుని అడుగుతూంటే ... నవ్వడం, మహా – పాపం పచ్చి బూతు ...

'ప్రాచీనమే అనుకో బాబూ, కాని, ఆయుర్వేదంలో దీనికి ఎందుచేతనో స్థానం

యిచ్చారు కాదు మన పెద్దలు. అందుచేత, తంత్రోక్త విధానాన్ని అనుసరించి చికిత్స చేస్తాను. అందులో ప్రక్రియలన్నీ శివుడు పార్వతికి చెప్పినవే కనుక, ఏదీ అబద్ధం కాదు. కనుకనే ఆ గ్రంథాల్లో ప్రతి విధానం చివరా 'ఇది పరమ రహస్యం సుమా!' అని ఒట్టువేస్తూ ఉంటారు ఆచార్యులు...మనవాడి అస్వస్థత ఓ లెక్కలోనిది కాదులే. మహా మహోలాటివే తుపాకీ వేసినట్టు ఎగిరిపోతాయి.'

'సరే నాయనా. అంతా నీదే భారం' అని నిశ్చింతగా ఉన్నాడు. ఆ పూటనుంచీ సుబ్బన్నబాబు.

'అంతా నీదే భారం' అని ఆయన ఇట్టె అన్నాడు; నేనూ చులాగ్గా ఔనని తల తిప్పానన్న మాటే కాని...

ఊఁ సరే కాని చూదాం ...

ఏమిటి చూసేది; అచ్చన్నకు ఓనమాలు దగ్గిరనుంచీ ప్రారంభించాలి. ఎంత చూపించినా గుణించుకు పోయే రకమే కాదు.

ఘుమ ఘుమాయించే అత్తరువులు వాడి తల దిమ్మెక్కించలేదు.

నేను నూరిపోసిన వేదవాక్యాలు వేటికీ వాటిల్లో ఒక్క దానికీ వాడి ఒళ్ళు ఝుల్లు మనలేదు...ఇదేమిటి, అదేమిటి వాడి పంచేంద్రియములూ కూడా ఆ చదువు మాట ఎత్తేటప్పటికి ... మొండికేసి ఊరుకుంటూన్నవి ... కాని ...

వాటికన్న, మనం మొండికెయ్యాలి. వంటపట్టినా - వంటపట్టకపోయినా, 'అ' దగ్గిరనుంచి 'అం' దాకా గ్రంథమంతా వాడికి పూర్తి అయింది ... ఘట్టిగా చింతనకూడా అయింది. కనుక ఏ ప్రకరణంలో ఏ ప్రక్రియ ఉందో తడుముకోకుండా, వాడికి మనసుకు అందుబాటులోనే ఉంది ... కాని, ఇంతదూరం వచ్చినా ... 'అన్నయ్యా అది కావాల'ని వాడు ఒక్కనాడన్నా అడుగుతాడేమోనని ఎన్నెన్ని విధాలో చూశాను. ఉహూఁ - లాభంలేదు. అయినా, రోగి ఎక్కడన్నా ఫలానామందు యివ్వమని బ్రతిమాలుతాడు గనుకనా? - అది లోకవిరుద్ధమైన సంగతి ... అందుకని ...

'ఇదిరా నాయనా దీనికి తిరుగుడు, నీవు సేవించవలసిన ఔషధం ఇది' అని విప్పి చెప్పాను.

'అన్నయ్యా పరాంగనారతమూ పరమ పాతకం కాదా' అన్నాడు వాడు. ఇందుకు మేథకుడన్నాను కాని అన్నింటికీ అన్నానా?

'కాదురా నాయనా, యీ విషయం వచ్చేసరికల్లా 'పరులెవ్వరు, తానెవరు?' - పైగా ఇంకో సులువు కూడా చెపుతాను. లౌక్యంలో అయితే కొందరు దీన్ని దోషంగా పరిగణించ వచ్చునేమో కాని ... స్థూలదృష్టిలో ఔషధప్రాయంగా, పరిమితంగా సేవించినవాడు ఏ దోషమూ సంక్రమించక పోవడమే కాకుండా ఆయుర్వృద్ధికరము...'

సరేనయ్యా నేను చెవిని యిల్లుకట్టుకుని పోరగా - పోరగా ... ఓ పట్టానికి, సరేనని ఒప్పుకున్నాడు ... కాని యిందులో మళ్ళా ఓ అవాంతరం తెచ్చిపెట్టాడు. సక్రమంగా వివాహం చేసుకుని భార్య కాపురానికి వచ్చిన తరువాత సల్లక్షణంగా గృహస్థధర్మం నిర్వర్తించుతాను. ఆ మాత్రం వ్యవధి ఉంటే ఫరవాలేదు కదా అని నంగనాచిలాగా అడిగాడు. ఆడి వీడియిల్లు బంగారంగానూ, మనమైతే పోనీ నోట్లో వేలువేసుకుని చూస్తూ కనిపెట్టుకుని ఉండగలము గాని, కళ్ళూ ఒళ్ళూ ముక్కుకు

సూటిగా నడుస్తూ మనం చెప్పిన మాట వింటూ మంచి బుద్ధి కలిగి ఉంటాయని – ఏమిటా నమ్మకం ... ఇలా అస్తమానమూ సలసలలాడుతూ ఉంటే, కుర్రవాడు ఎంత ఇదిగా ఉన్నవాడైనా అనాటి కానాడు లోబడి కర్పూరంలాగా హరించుకు పోడూ...

ఒక్క క్షణం, ఇహ ఉపేక్ష చేసేందుకు వీలులేదయ్యా ...

ఆ రాత్రికే ముహూర్తము పెట్టాను.

అచ్చంగా అప్సరలు ఆకాశంనించి ఎక్కడ దిగివస్తారుగాని ... అంత ధర పెట్టినందుకు ఆ సరుకుకు ... ఏ వంకా లేదు.

ఏవో పువ్వులూ కాయలు. ఇల్లా నేను చేయాలిసింది నేను చేశాను. చల్లని గాలీ, తెల్లగా తెల్లారినట్లు వెన్నెలా ... మనం చేసే పని మంచిదైనప్పుడూ, దేవతలు హర్షించుతారు. ఈ రాత్రితో అచ్చన్న ఇదంతా ...

ఇంకా కాస్సేపుంటే కిలకిలలూ కలకలలూ ప్రారంభం అవుతాయని తెలుసు ... గుస గుసలంటే వినపడవన్నమాటే కాని అచ్చన్నను ... అవును మరి, పండితుణ్ణి చేశాను ... నే నిహ నిశ్చింతగా నిద్రపోవచ్చును.

ఏమిటి ... ఇప్పుడు నాతో ఏం పని ... ఇక్కడ ఏం ఒరగ **బెట్టావు**? ... అంటున్నాయి నా నోరుకన్న ముందు, నా నొసలు. అచ్చన్న ... అమాయికంగా ... బెల్లంకొట్టిన రాయిలాగా ... నిలుచున్న చోటే నేలకు అతుక్కుపోయి నిలుచున్నాడు.

'ఏం?' అన్నాను.

'ఎబ్బే' అనేందుకు మెలితిరిగాయి వాడి పెదవులు.

ఓ మాటూ కింకోమాట 'ఏం, అన్నాను...' **ఉహుఁ అని గునిశాడు** అచ్చన్న.

'ఏమిట్రా తమ్ముడూ?'

ఏమీ లేదంటాడు, ఏదో నసుగుతాడు. ఏమీ **లేకపోతే, యిక్క** డెందుకయ్యా నుంచోడం? – నీకు యిన్ని నీతులూ చెప్పి చివరకు ...

ఇప్పుడన్నా లోపలికి పోడేం? ... ఆ గడుగ్గాయ ... లోపల ఏమన్నా కొంటెతనం చేసిందా?

'లేదు బాబూ నేనేం అనలేదండీ, తమరికి **తెలియదు** గనకనా నా **గుణం**? – ఏమే పిల్లా నీ పేరు ఏమిటి అన్నారండీ; నాపేరు **ఇదీ అన్నానండీ; అంతటితో** ఇక ఏదీ లేకుండా ఉగ్రంగా వచ్చేశారండీ. ఇంతకు మినా నేను ఏదన్నా అనుంటే అప్పుడు తమరు...'

అవును, అది ఎంతవరకూ అవసరమో అంతవరకే మాట్లాడేరకం గాని...అనవసరంగా అదీ – ఇదీ అనే రకం కాదు ... అబ్బో అది నీలాటి వాళ్ళనీ – నాలాటి వాళ్ళనీ లక్షమందిని కాచి వడిపోసింది మరి...

'ఏమే పిల్లా, నీ పేరు లక్ష్మిందేవి కాదూ?' నా ప్రశ్నకు ఆశ్చర్యపడి నవ్వి, అనవసరంగా సిగ్గుపడి 'చాల్లెగండి' అంది. ఏమిటి, నీపేరు లక్ష్మిందేవి కాదూ? అని నేను ఆశ్చర్యపడ్డాను. దానికి వెకిలిగా – వెటకారంగా తోచి 'మీదంతా చోద్యం లెగండి, నేనూ...చీతమ్మను కాదేంటండీ, యియ్యాళ మీకు కొత్తయినట్టు ... మరుపు తగిలినట్టు...

దానిపేరు చెవిని పడేప్పటికల్లా ... అచ్చన్న గతుక్‌మన్నాడు ... వాడి కళ్ళల్లో కనబడే అసహ్యానికి అంతూ పంతూ లేదు.

నిజంగా అదీ అబ్బురమే! – కామయ్య కోదండం ఎక్కుపెట్టుకుని ... క్రుర్రూ బుస్సూ మంటూ కూర్చున్న ప్రళయం – అప్పుడు కూడా స–కార–చ–కారములలో తేడా ఎంచుకుని, మంచు ముద్దలాగా, శివకవచం ధరించడానికి నోచుకున్న ... ప్చ్ ... శివ శివ ... వాడిని మెచ్చుకున్నా, నొచ్చుకున్నా శివాపచార దోషం చుట్టుకుంటుంది. అయినా, ఎంత చెడ్డా, దీనిల్లు రెండిందాల బంగారంగానూ, మానవదేహం కదా, శబ్ద – స్పర్శ – రూప ఇత్యాదులన్నారు కదా ... తతిమ్మా అనుపానాలు ఏమన్నా పని చేస్తాయేమో చూద్దాం అని తంటాలు పడటం ... తప్పా అని ఎవరు అంటారు?

చూపించక ముందే అందుకుపోయే రకం అని అననే అంటినిగా –

నా చెయ్యి సైగ తగిలీ తగలకముందే, ఒళ్ళు విరుపుడుగా పోయి, అచ్చన్నమీద కౌగిలింతై విరుచుకు పడ్డది... ఒళ్ళు మెసలకుండా కట్టేసింది ... కనుచూపు మేరంతా ఎంగిలిచేసింది ... ఇంకా ... ఎంతో – చాలావరకు తెగించింది ...

ఘోరున వాన కురుస్తూన్న ముసురులో పచ్చికట్టెలు పొయ్యికి అంటించి, రెక్కలు పడిపోయేట్టు విసిరి – విసిరి, ఆఖరికి ప్రాణం విసుగొచ్చి, విసనకర్ర అవతల విసిరి పుచ్చుకుపారేసి అక్కడనుంచి, ఉక్కిరి బిక్కిరిగా లేచే యిల్లాలి వతు...ప్చ్, ఉచ్చ – నీచాలంటూ లేని, ఆఁ ... తుక్కు దుమారానికే అసహ్యం వేసిందంటే ... వీడు గడ్డకట్టుకుపోవడం చూసి ...

నావంక మంటలు మండేట్టు చూసింది. 'ఇక నా తరం కాదయ్యా బాబూ' అంటున్నాయి ఆ కళ్ళు రెండూ. ఇంకోడ్నీ – ఇంకోడ్నీ అయితే ... ఆ పెదవులు రెండూ అన్నమాట అనకుండా అక్కడ నిలవేసి, బండబూతుల్లో పాతేసేవి కావూ? – కాసో వీసమో కోసం కక్కుర్తిగా ఒళ్ళు యిచ్చుకునే కులమైనా వల్లమాలిన ఏబ్రాసితో, వళ్ళు హైరాను కాకుండా సరసమాడినట్లు మొక్కు తీర్చుకోవడం ... అది వాళ్ళకు అవమానం. అందుకనే రొక్కము పుచ్చుకుని 'మామా' అని గట్టిగా మందలించే గోడిగ లన్నింటికీ ముక్కుమీదే ఉంటుంది కోపం.

సరేలే, అది యింతకన్నా చేసేదేం లేదు ... దాని త్రోవను అది వెళ్ళిపోయింది ... నేను బిగ్గరగా నవ్వుతున్నాను ... యిల్లు తీసి పందిరి వేసేట్టు ... ఎందుకు వచ్చింది నాకీ బాదర – బందిరి అనుకోవడం ... పగల పడటం ... అచ్చన్న పాపం, నేను కసురుతానేమోనని చిన్నబుచ్చుకుని తల దించుకుని నిలుచున్నాడు. వాడివంక చూస్తే జాలేసింది ... వళ్ళంతా ఎంగిలి మయం ... ఎంతసేపో గాయత్రి చెయ్యాలి ... ఎంతసేపో, అంతమేరా ఆ ఇది పోయేట్టు అరగదియ్యాలి ... సరే, యింతకూ పొరబాటు, వాడి మానాన వాడిని ఉండనియ్యాలిసింది.

ఎట్లా ఉంది, వాడి వంట్లో? ... ఇంకా సల సల తగ్గలేదు? ... పాపం, ఆయన ఆదుర్దాకొద్దీ అడుగుతాడు.

'ఫరవాలేదు బాబూ, వెన్నెలతో కుస్తీ పట్టిస్తేనే, మనవాడి సిగ పూవాడలేదు ... ఈ వేడీ గీడీ వాడిని ఏం చేస్తాయి...'

కాని ... యింతవేడి వ్యర్థంగా వంట్లోనే మరగిపోతూంటే ... ఆ కాయంవల్ల లోకానికి ఏం లాభం. అని మనలో మనమన్నా తర్కించుకోవాలా? నిజమే.

వాడు అందునా, యిందునా చెడటంకన్న ఆ సత్తువనంతా, అధికాహారోత్పత్తి ఉద్యమంలో ప్రవేశపెడితే, ఏటికి ఏడాదీ, తడుముకోనక్కర లేకుండా, కాయా కూరా అమురుతుంది. ఏలికలూ ఆమోదిస్తారు. తరువాత దైవం రక్షిస్తే, ఏనాటికన్నా తోటలో పడి తవ్వగా తవ్వగా, సూరన్న పంతులుగారి ప్రబంధంలో సుగాత్రి పెనిమిటిలాగా వాడూ తెలివిమీరి, చల్లబడక పోతాడా?

సుబ్బన్న బాబు ఏమంటాడూ, నేను ఏది చెబితే అదే ఔషధం. అచ్చన్న ఎన్నడూ ఔను కాదూ అనే ఘటం కాదు. అదీ గాకుండా ఏదోకమని చెప్పి వాడిచేత ఎంత పాడుపని చేయించినా సుబ్బన్నబాబు ఏమీ అనుకోడు. ఎవరి విషయంలోనూ ఏమీ అనుకోడు. అందులో మరీ నేనంటే ఆయనకు తగని గురి. సరే అన్నీ బాగానే ఉన్నాయి. కాని 'వాడికన్న నాకు సలపరింత ఎక్కువైంది. బూతును మించిన బూతుపని వాడిచేత చేయించడం ఎలా? నా తరం కాదు.

'నా తరం కాదూ?' అని లోకంలో ఏదో మూలమార్మోగింది. గదమాయింపుగా ఎదురుగుండా కనపడే ఆకాశం. ఎదిగిన మొక్కలు, ఎర్రని పచ్చని పూలు, పరుపుగా ఒళ్ళు విరుచుకుంటూన్న పచ్చ పట్టు ఎవళ్ళూ హాజంతో అంతమాట అన్నట్టు కనబడటం లేదు. కాని అన్నింటినీ కలిపి తేరి పారజూసేప్పటికి ఆ ధీమా గింగురు మంటూంది. సరే ఎందుకన్నా మంచిది. ప్రకృతికే వదిలేద్దాం. యీ విషయంలో మన అందరికన్నా ఆవిడకు ఎక్కువ అనుభవం ఉన్నట్టుంది.

నేడో రేపో కాయలుకాచే తీగెలన్నీ, పెరిగి పెద్దవౌతున్నాయి. అచ్చన్న కళ్ళలోకి అడపా దడపా లాలింపు, నిన్ననే కాపురానికి వచ్చిన కొత్త కోడలిలాగా చాటునుంచి తళుక్ మంటుంది.

తోటలో ఆ మూల కమ్ముకున్న మల్లెపొద మ్రొగ్గతొడుగుతూంది. ఆ పొదు ఎప్పుడూ ఎండకుండా ఉంటుంది.

అచ్చన్న అలా అల్లంత దూరాన పై డాబామీద ... చెంగు వాల్చుకు ఎన్నడన్నా నాకు తోడు పడుకునేవాడు. వాడికి కునుకు రానంతసేపు మా కళ్ళ ముందర, ఆకాశం మీదుగా అల్లంత చేరువలో ఎందరో దేవకన్యలు మందలు మందలుగా, ఎవరినో తరుముకు పోతూండేవారు. ఎంతోసేపటికి వాళ్ళు కట్టుకున్న కోకలు వెతుక్కుంటూ వెంబడించేవి.

మల్లె మొగ్గలు విచ్చి క్రింద రాలిపోయేదాకా, చెట్టున ఎవ్వరూ అట్టేపెట్టరు. చెట్టున ఎప్పుడూ ఒక్క పసరు మొగ్గయినా కనబడదేం? ఏ రోజున చూసినా పొద పసందుగా బబ్బుని ఉంటుంది కాని.

అచ్చన్న నిన్నా – నేడూ కనబడలేదు. నాకూ యీ మధ్యను వారం పది రోజులాయె తీరడం లేదనుకో. అయినా వాడిని ఏపూటో – ఓపూట చూడటం అలవాటైందేమో. చూస్తే ఒరిగేదేం లేదుకాని, చూడలేదని జ్ఞాపకం వచ్చినప్పుడూ, అనవసరంగా ఏదో వెలితి కనిపిస్తుంది మొత్తానికి.

'ఏం రా' అని పలుకరించడం నాకు ఇదివరకు ఎప్పుడూ మామూలు లేదు; కాని, యివాళ అచ్చన్న కనబడటంతోనే అలా కవ్వించ మనసైంది.

'ఏం లేదన్నయ్యా'

వాడు మెదలకుండా ఊరుకుంటే 'ఏమీ లేదు' అనుకునేవాణ్ణి. ఏం లేదు అనేప్పటికి 'ఏం లేకపోవడ మేమిటి?' అని నన్ను నేను గదమాయించింది. ఏముందో దేన్ని అడిగినా జవాబు చెబుతుంది. కనుబొమ్మ అయితే ముద్దరాలుగా ఔనో కాదో ముక్తసరిగా చెప్పి ఊరుకుంటుంది. కన్నైతేనో, తలచుకున్నా దాచుకోలేకుండా, కర్త - కర్మ - క్రియ తూకంతో వాక్యాలు గ్రుమ్మరిస్తుంది. ఒక్క కావ్యం అల్లార్చడానికి దీక్షైన కంటికి ఎంతో కాలం పట్టదు.

ఆ కన్ను నాతో ఏం చెప్పిపోతుందో అని అచ్చన్నకు భయం వేస్తూందా? వాడి నూ నూగు - పెదవి విల్లుకన్న అందంగా, గుండెతో బాటు మందంగా అదిరి పడటం ఎక్కడ నేర్చుకు వచ్చింది.

నావంక చూడకుండానే అచ్చన్న అవతలకు వెళ్ళిపోయినాడు. యివాళ కాకపోతే రేపు దొరుకుతాడు. తల నిలవేసి, ఆ చిన్నదాని హోయ్ - హోయ్ అంతా వాడి కళ్ళలో పాఠం అప్పజెప్పిస్తాను. ఒకటికి పద్దై వృద్ధిలోకి రావలసినవాడు. అది కావ్యంలో బులబాటం కొద్దీ అచ్చుతప్పులు ఎక్కువ రావడం సహజం. కనుక ...

అచ్చన్నకు ఇహ ఏం ఫరవాలేదు. అని ఖచ్చితంగా చెప్పితే, పాపం సుబ్బన్న బాబు సంతోషిస్తాడు. అదే మనకు ఫలం పాటు ...

★ ★ ★